క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కారంచేడు: కారంచేడు మండల పరిషత్ సమావేశం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన నిర్వహించనున్నారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వీఆర్‌ఓలు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతిని వెంట పెట్టుకొని తప్పకుండా హాజరు కావాలని కోరారు. హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలకు శిఫార్సు చేయనున్నట్లు ఆయన హెచ్చరించారు.

రేపు ద్రోణాదుల చరిత్ర గ్రంథ ఆవిష్కరణ

మార్టూరు: మండలంలోని ద్రోణాదులలో ఈ నెల బుధవారం ఆ గ్రామ చరిత్రకు సంబంధించిన గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని గోపు లక్ష్మీనారాయణ తులశమ్మ ఫంక్షన్ హాలులో ఉదయం పది గంటలకు పెంటేల రాజా రచించిన ద్రోణాదుల గ్రామ చరిత్ర గ్రంథాన్ని నాగార్జున విశ్వవిద్యాలయ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు చేతుల మీదుగా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ద్రోణాదుల గ్రామానికి సంబంధించిన ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధ్వజస్తంభం తొలగింపు కోసం ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఏసీ తిమ్మనాయుడు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ దేవస్థానంలో ధ్వజస్తంభం తొలగింపులో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుతగా ధ్వజస్తంభం దాత మేదరమెట్ల శంకరరెడ్డి కుటుంబ సభ్యులు, దేవస్థాన అర్చకులు, దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రెవెన్యూఅధికారులతో పంచానామా నిర్వహించి ధ్వజస్తంభం తొలగించనున్నట్లు తెలిపారు.

ఐదు గ్రామాలకు నీటితొట్లు మంజూరు


నీటితొట్టి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రమేశ్‌బాబు

అద్దంకి: మండలంలోని ఐదు గ్రామాలకు నీటితొట్లు మంజూరైనట్లు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ రమేశ్‌బాబు చెప్పారు. ఆయన సోమవారం మండలంలోని తిమ్మాయపాలెంలో కడుతున్న నీటితొట్ల నిర్మాణాన్ని పశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తిమ్మాయపాలెం, కుంకుపాడు, మోదేపల్లి, వెంపరాల, కొటికలపూడి గ్రామాలకు మొదటి విడతలో నీటితొట్లు మంజూరయ్యాయని చెప్పారు. నీటితొట్ల నిర్మాణన్ని నాణ్యతతో త్వరలో పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట అద్దంకి ఏడీ మోహనరావు ఉన్నారు.

రూ.2.35 లక్షలు పలికిన అడవిపాలెం చెరువు వేలం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని అడవిపాలెం చెరువుకు వేలంపాటను సోమవారం స్థానిక సచివాయంలో ఈఓపీఆర్డీ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండేళ్లకుగాను శావల్యపురం గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 2.35 లక్షలకు పాడి దక్కించుకున్నాడు. సర్పంచ్ దిండు హనుమంతురావు, కార్యదర్శి నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన సంగీతరావు

పర్చూరు (చినగంజాం): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన పర్చూరుకు సమీపంలోని నక్కవాగు వద్ద సోమవారం జరిగింది. నూతలపాడు గ్రామానికి చెందిన మార్పు సంగీతరావు సోమవారం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తూ మార్గమధ్యంలో నక్కవాగు వద్ద వాహనం అదుపుతప్పి వాగులో పడిపోవడంతో తీవ్ర గాయలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి అతడిని 108లో ముందుగా పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


ఆలయంలో అమ్మవార్లు


శివుని కుటుంబం


ఆలయానికి వెళ్లే దారిలోని ఆర్చి

తిరునాళ్లకు ఈర్లగంగమ్మ ముస్తాబు

బల్లికురవ: భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈర్లగంగమ్మ 64వ వార్షిక తిరునాళ్ల ఈ నెల 12న నిర్వహించేందుకు ఆలయాన్ని, ముఖద్వారాన్ని ముస్తాబు చేశారు. మండలంలోని కొణిదెన రెవెన్యూలోని ఈర్లకొండకు దిగువ భాగంలో 14వ శతాబ్దంలో ఈర్ల గంగమ్మ స్వయంభూగా వెలసినట్లు చరిత్ర చెబుతోంది. ఈ కొండ చుట్టూ లభించే స్టీల్‌గ్రే గ్రానైట్ రాళ్లకు దేశ, విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. నాలుగున్నర దశాబ్ధాలుగా సుమారు 25 వరకు గ్రానైట్ క్వారీలు ఏర్పాటుతో ఇక్కడ వేలాది మంది రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, బల్లికురవ, కొండాయపాలెం గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ, కూటమి ఆధ్వర్యంలో 11 వరకు భారీ ఎలక్ట్రిక్ ప్రభలు ఏర్పాటుకు సమాయత్తమవుతున్నారు.

భక్తుల సహకారంతో వసతులు

ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమికి అమ్మవారి వార్షిక తిరునాళ్ల నిర్వహిస్తారు. గ్రానైట్ ఎగుమతుల పుణ్యమా ఉంటూ గత 3 దశాబ్ధాలుగా తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం జిల్లాతో పాటు పరిసర జిల్లాల్లోని భక్తులు అమ్మవారి సన్నిధికి వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం గ్రానైట్ నిర్వాహకులు నక్కబొక్కలపాడు గ్రామస్తులు, భక్తులు వసతులు సమకూర్చారు. మాజీ మంత్రి లక్ష్మీ గ్రానైట్స్ అధినేత శిద్దా రాఘవరావు, ఎంవీ ఆర్ గ్రానైట్స్ అధినేత మారం వెంకరెడ్డి సమష్టి కృషితో అమ్మవారి సన్నిదానానికి ముందు మందిర నిర్మాణాన్ని పూర్తి చేశారు. శ్రీ శ్రీనివాసా గ్రానైట్స్ అధినేత, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి తలనీలాల మండపం నిర్మించారు. మల్లాయపాలెం, సోమవరప్పాడు, మార్టూరుకు చెందిన ఏడుగురు భక్తులు అమ్మవారి ఆలయం పక్కన శివుని కుటుంబానికి సంబంధించి విగ్రహాలు ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండల నిధులు గ్రామ పంచాయతీ నిధులు సుమారు రూ.90 లక్షలతో నక్కబొక్కలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులోని అమ్మవారి ఆర్చీ నుంచి సుమారు రెండు పర్లాంగుల రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు.

దాతలు భక్తులకు విశ్రాంత శాలల ఏర్పాటుతో సమకూర్చారు. ప్రతి సంవత్సరం పూజాది కార్యక్రమాలకు తిరునాళ్ల ముందు శ్రీరామనవమి రోజు నక్కబొక్కలపాడు గ్రామంలో పాట నిర్వహిస్తున్నారు. పాటలో ఆలయంలో పూజాది కార్యక్రమాలు దక్కించుకున్న వ్యక్తి 2026లో జరిగే తిరునాళ్ల ముందు వరకు పూజాది కార్యక్రమాలతోపాటు, కానుకలపై హక్కు ఉంటుంది. తిరునాళ్లకు సంబంధించి ఆలయాన్ని, వసతులు సంతమాగులూరు సీఐ వెంకటరావు ఇటీవల పరిశీలించి బందోబస్తు ఏర్పాటుపై ఎస్సై జీవీ చౌదరికి పలు సూచనలు చేశారు.


ఈర్ల గంగమ్మ ఆలయం

ఆహారపు అలవాట్లతో వ్యాధులు దూరం

చీరాల రూరల్: సరైన ఆహారపు అలవాట్లు, రోజువారి వ్యాయామాలతో వ్యాధులను దూరం చేసుకోవచ్చని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బాబూరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్, చీరాల వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో గుండె, షుగర్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ మనం వ్యాధులకు గురికావడం అంటే మన ఆహారపు అలవాట్లేనని చెప్పారు. సరైన సమయానికి ఆహారం తీసుకుంటూ రోజూ వ్యాయామాలు చేయాలని సూచించారు. ముఖ్యంగా పురుషులు దూమపానం, మద్యపానం మానివేయాలని చెప్పారు. కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలను బాగా తగ్గించి ప్రొటీన్లు కలిగిన ఆహారం, చిరుధాన్యాలు, ముడి బియ్యం, చిక్కుళ్లు, బాతాణీలు, కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు, ఒమెగా, మూడు ప్యాటీ ఆమ్లాలను ఆకలిగా ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలని సూచించారు. అలాగే తగినంత నిద్ర, క్రమం తప్పకుండా ఆహారం, శారీరక శ్రమ, మానసిక ప్రశాంతతతో జబ్బుల నుంచి బయటపడవచ్చని తెలిపారు. గుండెకు సంబంధించి ఏదైనా నొప్పిగా అనిపిస్తే ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి ఆయన సలహాల మేరకు ఈసీజీ తీయించుకుని మందులు వాడుకోవాలని సూచించారు. షుగర్, గుండె, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం రోటరీ, వాకర్స్ సభ్యులు కలిసి డాక్టర్ బాబూరావును సత్కరించారు. రోటరీ అధ్యక్షుడు చందలూరి బాల వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, గ్రంధి నారాయణ మూర్తి, జీవై ప్రసాద్, డీవీ సురేష్, సీహెచ్ రమేష్, సుభాషిణి, వీరాంజనేయులు, జి.బదరీనాథ్, పూర్ణా, తిరుపతిరావు, జి.రమేష్, స్వామి పాల్గొన్నారు.


డాక్టర్ బాబూరావును సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, వాకర్స్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై ర్యాలీ

కారంచేడు: సమాజంలో ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యంతో ఉండేలా ప్రణాళికలను సిద్ధం చేసి ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రధాన ఉద్దేశమని స్వర్ణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.శాలినీ అన్నారు. సోమవారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ నుంచి హైస్కూల్, చెరువు బజారు, పంచాయతీ కార్యాలయం మీదగా బ్యాంక్ సెంటర్ వరకు అవగహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ వైద్య సిబ్బందితో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడ ప్రజలతో ఆమె మాట్లాడారు. ఆరోగ్యకరమైన ప్రారంభం–ఆశాజనక భవిష్యత్తు అనే అంశంతో తల్లీ, బిడ్డల ఆరోగ్య నియమాలను ఆమె వివరించారు. తల్లితో పాటు అప్పుడే పుట్టిన బిడ్డ (నవజాతశిశువు) ఆరోగ్యంగా ఉండటం, నివారించ తగిన మరణాలను సైతం సమాజంలో తగ్గించడం వంటి వాటిపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎంపీహెచ్‌ఈఓ వి.నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో డాక్టర్ శాలినీ, వైద్య సిబ్బంది

ఆరోగ్యమే మహాభాగ్యం

మేదరమెట్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని మేదరమెట్ల యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ జి.శ్రావణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొరిశపాడు మండలం మేదరమెట్లలో హెల్ప్ టీఐ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చెడు వ్యసనాలతో అపరిశుభ్రమైన ఆహారాన్ని తినడం, మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. ఆహారం, నీరు, గాలి కలుషితం అవ్వడం ద్వారా చిన్న వయసులోనే రక్తపోటు, షుగర్ లాంటి రోగాలు వస్తున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశ వర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. పరిశుభ్రమైన ఆహారాన్ని, స్వచ్ఛమైన నీటిని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందని వివరించారు. టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, హెచ్‌సీవో బ్రహ్మానందం, పీహెచ్‌ఎస్ సురేఖ, అనిల్‌కుమార్, దుర్గ, కృష్ణవేణి పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రావణి

ప్రతి బిడ్డా బడిలో ఉండాలి

అద్దంకి: ఐదేళ్లు నిండిన ప్రతి బిడ్డా బడిలో ఉండాలని ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం అద్దంకి పట్టణంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (సత్రంబడి) లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చామర్తివారివీధి, సాయిబాబా గుడి ప్రాంతం, గౌడపాలెం నందులోని గృహాలను సందర్శించి ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించమని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే బోధన గురించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యావ్యవస్థపై చేస్తున్న ఖర్చు గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, బూట్లు, బ్యాగ్ ప్రతి విద్యార్థికి అందిస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత ముగ్గురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులు ఇట్టా రామారావు, మానికొండ ధనలక్ష్మి, ఎం. వేదవతి, కె.కవితాలక్ష్మి, గుడి కొండమ్మ, డి.సువర్చల, షేక్ మస్తాన్ వలి, పాలపర్తి యోనా, కొంగల శ్రీనివాసు, అంగన్వాడీ కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.


అడ్మిషన్ అందిస్తున్న ఉపాధ్యాయులు

నలుగురు జూదరుల అరెస్టు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు జూదరులను అరెస్టు చేశారు. కారంచేడు ఎస్‌ఐ వెంకట్రావు అందించిన సమచారం ప్రకారం.. ఆదివారం అర్ధ రాత్రి సమయంలో మండల కేంద్రం కారంచేడు పొలాలకు వెళ్లే డొంక రోడ్ల వద్ద నలుగురు పేకాడుతున్నట్లు గుర్తించారు. వారి నుంచి రూ. రూ.27 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ వెంకట్రావు వివరించారు.

ఇంటింటికీ చెత్త సేకరించాలి

అద్దంకి: గ్రామాల్లో నూరు శాతం డోర్ టూ డోర్ గార్బేజ్ సేకరణ కార్యక్రమం నిర్వహించాలని ఈవోపీఆర్‌ఆర్డీ ప్రసాదరావు సూచించారు. దాని కోసం ఎంపిక చేసిన 6 గ్రామ పంచాయతీల్లో ఐవీఆర్‌ఎస్ కాల్స్ వస్తాయని వివరించారు. ఈవోపీఆర్‌డీ ప్రసాదరావు అద్దంకి మండలంలోని చక్రాయపాలెంలో విజిట్ చేసి ప్రజలకు కాల్స్‌పై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి రెండు లేదా మూడు రోజులకు ఒకసారి ఇంటి నుంచి చెత్త సేకరిస్తారన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


పర్చూరు (చినగంజాం): వేసవిని దృష్టిలో ఉంచుకొని పర్చూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వి. ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. సోమవారం ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించిన సందర్భాన్ని పురస్కరించుకొని మాట్లాడారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో వేసవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిబ్బంది, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామబ్రహ్మం, కోటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జె.పంగులూరు: స్థానిక బస్టాండ్ సెంటర్, వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో సోమవారం ఎంపీడీవో స్వరూపరాణి చేతుల మీదగా చలివేద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ఆరంభం నుంచి ఎండల తమ ప్రతాపం చూపిస్తున్నాయన్నారు. వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీలున్నంత వరకు ప్రయాణాలు ఆపుకోవాలని సూచించారు. ప్రయాణాల సమయంలో ఎప్పుడూ మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

మండలంలోని ప్రతి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ నాయకులు మేడ సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చీరాల నుంచి సచివాలయానికి బస్సు నడపాలి

చీరాల: చీరాల నుంచి అమరావతి రాజధాని, హైకోర్టు, సచివాలయానికి నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ నేతాజీ సేవా సమితి అసోసియేట్ అధ్యక్షుడు, న్యాయవాది కనపర్తి రామారావు, చుండూరి కృష్ణమూర్తి, సభ్యులు ఆర్టీసీ డిపో మేనేజర్ జంజనం శ్యామలకు వినతిపత్రం అందించారు. వివిధ పనుల కోసం రాష్ట్ర సచివాలయానికి, హైకోర్టుకు ప్రజలు వెళ్లాలంటే మంగళగిరి, గుంటూరు వెళ్లి అక్కడి నుంచి సచివాలయానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. క్యాకుల నాగేశ్వరరావు, డేగల వెంకటేశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నేతలు

పీజీఆర్‌ఎస్‌తో సమస్యల పరిష్కారం

చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక చక్కటి మార్గమని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. పీజీఆర్‌ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. పలు శాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించగా ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై ప్రజలు 17 అర్జీలు అందించారు. వీఆర్వోలు, పలుశాఖల ఉద్యోగులు ఉన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఎంపీడీవో బి.శివసుబ్రహ్మణ్యం పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా పంచాయితీ అభివృద్ధి అధికారి ఆదేశాలతో కార్యదర్శులు ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పన్ను వసూళ్లలో అలసత్వంతో గ్రామ పంచాయితీల్లో పలు సమస్యలు వేధిస్తున్నాయన్నారు. ఈ నెల 30 తేదీలోపు అన్నీ గ్రామ పంచాయతీల నుంచి 100 శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుని గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా వాటర్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లు మరమ్మతులు చేయించి మంచి నీరు ప్రజలకు అందించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు శ్రద్ధగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీల కార్యదర్శులు, సచివాయాల కార్యదర్శులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం

చీరాల టౌన్: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రంతో ఉపశమనం కలుగుతుందని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మినరల్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవి కాలం పూర్తయ్యేంత వరకు మంచి నీటి సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. మినరల్ వాటర్ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈడీటీ సుశీల, ఆర్ఐలు సత్యం, శేఖర్, వీఆర్వోలు కృష్ణారెడ్డి, కళ్యాణ్, కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

220 మందికి వైద్య పరీక్షలు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని సుబ్బారెడ్డిపాలెంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 220 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వైద్యశిబిరాన్ని సర్పంచ్ భవనం సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యశిబిరంలో రోగులకు కంటి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి గుండె, కిడ్నీ రోగులకు తగు జాగ్రత్తలు తెలిపారు. ఉచితంగా మందులు అందజేశారు. రోగ నిర్ధారణ జరిగిన 36 మందికి మెరుగైన వైద్యచికిత్స కోసం కిమ్స్ హాస్పిటల్‌కు సిఫారసు చేశారు. రోగులకు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్‌ఎస్, ఈసీహెచ్‌ఎస్, రైల్వే, ఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ప్రతినిధి షేక్ రఫి వివరించారు. వైద్యనిపుణులు రామాంజనేయులు, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి

- నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై రైతు సంఘ నాయకుల వినతి

జె.పంగులూరు: బాపట్ల జిల్లాలో నల్లబర్లి పొగాకును సాగు చేసిన రైతుల ఇబ్బందులు గమనించి ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసనసభ్యుడు ఏలూరు సాంబశివరావులను రైతు సంఘ బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమల్ల కోటేశ్వరరావులు కోరారు. సోమవారం సాయంత్రం పంగులూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో బర్లీ పొగాకు లక్షల ఎకరాల్లో సాగు చేశారని, జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా సాగైందని తెలిపారు. అందులోనూ సుమారు 60 వేల ఎకరాల్లో రైతులు నల్లబర్లి పొగాకును సాగు చేశారన్నారు. ఈ ప్రాంతాల్లో సహజంగా రైతులు సాగు చేసిన మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో గత సంవత్సరం నుంచి ఈ ప్రాంతాల్లో బర్లి పొగాకు సాగు చేశారన్నారు. కంపెనీల మాటలు నమ్మిన కౌలు రైతులు లక్షలాది రుపాయలు అప్పులు తెచ్చి, పెట్టుబడులు పెట్టి బర్లి పొగాకు సాగు చేశారని పేర్కొన్నారు. పంట చేతికి రావడంతో తెల్లబర్లి పొగాకు కొంత కొనుగోలు చేశారన్నారు. నల్లబర్లి పొగాకు మాత్రం ఇంత వరకు కొనుగోలు చేయలేదని రామారావు, రామకోటేశ్వరరావు తెలిపారు. నల్లబర్లి పొగాకు కంపెనీలు కొంటాయో, కొనవో తెలియక రైతులు అయోమయ స్థితిలో ఉన్నారన్నారు. పొగాకు సాగు చేసిన వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని, వారికి ప్రభుత్వం ఎక్కడ ప్రోత్సాహం అందించకపోయినా, రుణ సదుపాయం కల్పించకపోయినా, అప్పు తెచ్చి పొగాకు పండించారని వివరించారు. డబ్బులు రాక, అప్పులిచ్చిన వారికి సమాధానం చెప్పుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వంతో మాట్లాడాలని, అవసరమైతే కేంద్రం ప్రభుత్వంతో కూడా మాట్లాడి నల్లబర్లి పొగాకు కొనుగోలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి రవికుమార్‌ను, శాసన సభ్యుడు సాంబశివరావును కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘ నేతలు